క్లుప్తంగా

ఎస్పీఎల్ క్రీడా స్ఫూర్తికి నిదర్శనం



విజయవాడ స్పోర్ట్స్: సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) క్రీడా స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనమని ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేష్ అన్నారు. గత నెల 25 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన ఎస్పీఎల్ ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి క్రికెట్ సీనియర్స్ విభాగంలో లయోలా కాలేజీ జట్టు రన్నర్ ట్రోఫీని అందుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కాలేజీ యాజమాన్యం కాలేజీ క్రికెట్ జట్టును శనివారం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సాక్షి మీడియా గ్రూప్ జిల్లా, రీజినల్, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా జట్లు రానున్న మరిన్ని టోర్నమెంట్లకు ప్రాతినిధ్యం వహించేందుకు ఎస్పీఎల్ దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా క్రికెట్ పోటీలు నిర్వహించిన సాక్షి యాజమాన్యానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ ఫాదర్ ఫ్రాన్సిస్‌జెవిఎల్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఫాదర్ డి.బాలస్వామి, కె.రవీంద్రనాథ్, పీడీ వై.రాజేష్ పాల్గొన్నారు.

జీఎస్టీ రాకతో కాస్ట్ అకౌంటెంట్లకు డిమాండ్



లబ్బీపేట(విజయవాడతూర్పు): జీఎస్టీ రాకతో కాస్ట్ అకౌంటెంట్లకు అవకాశాలు పెరిగాయని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా రీజినల్ కౌన్సిల్ చైర్మన్ శంకర్ పీ పణికర్ అన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం రాష్ట్రస్థాయి సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) స్టూడెంట్ల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు వెయ్యి మందికిపైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి శంకర్ పీ పణికర్ మాట్లాడుతూ.. దేశంలో సీఎంఏ మంచి గుర్తింపు ఉన్న కామర్స్ ప్రొఫెషనల్ కోర్సని పేర్కొన్నారు. సీఎంఏ పూర్తి చేసిన వారికి దేశవిదేశాల్లో అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. సీఎంఏ కోర్సును మూడు స్థాయిల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ కామర్స్‌లో చేరి, సీఎంఏ కోర్సు చేస్తే బీకాం సెకండియర్‌తో పాటు, సీఎంఏ పూర్తి చేయవచ్చని సూచించారు. ఇంటర్మీడియెట్ తర్వాత బీకాంతో పాటు, మూడేళ్లలో సీఎంఏ పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. బీకాం తర్వాత సీఎంఏలో చేరితే 18 నెలల్లో పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఈ కోర్సు చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.సదస్సులో పాల్గొ న్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు పాపారావు పాల్గొన్నారు.

సైక్లింగ్ ఎంపికల ట్రయల్స్‌కు స్పందన

నున్న(విజయవాడరూరల్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) కృష్ణా జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో నున్న వికాస్ కాలేజీ రోడ్డులో శనివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ సైక్లింగ్ ఎంపిక ట్రయల్స్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. వీటిని వికాస్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా ఎస్‌జీఎఫ్ ప్రోత్సహిస్తోందన్నారు. ఫెడరేషన్ అండర్–14, 17 కార్యదర్శి తోట అజయ్ కుమార్ ఈ నెల 12, 13 తేదీల్లో అండర్– 17, 19 బాలబాలికల అంతర్ జిల్లా సైక్లింగ్ చాంపియన్‌షిప్, 16,17 తేదీల్లో అండర్14 చాంపియన్ షిప్‌ను నరసరావుపేటలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శన ఆధారంగా కృష్ణా జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించే బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా సైక్లింగ్ సంఘ ప్రధాన కార్యదర్శి సుగుణరావు, వికాస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు ఎంవీ సత్యప్రసాద్, టి.శ్రీలత, ఎం.వెంకటేశ్వరావు, విజయవర్మ, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు సత్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల మూడు, నాలుగు తేదీలలో గుడివాడ ఏఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ రేస్‌లో విజేతలుగా నిలిచిన ఎస్ఆర్ఆర్ విద్యార్థులను శనివారం కళాశాలలో సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కళాశాలకు చెందిన క్రీడాకారులు కె.మధు, తరుణ్‌కుమార్, తేజోరాం, శివ, వెంకటరమణ గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను సత్కరించారు.

క్రీడల్లో రాణిస్తున్న ఎస్‌టీవీఆర్ విద్యార్థులు

సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శైలేంద్రను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. అతి సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో సత్తాచాటి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు పర్యవేక్షణలో రోజుకు ఐదు నుంచి ఆరు గంటలు ప్రాక్టీస్ చేస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలు అందుకుంటున్నారు. సాధారణ విద్యార్థులు సైతం అసాధారణ ఫలితాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. పాఠశాల విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మమైన స్టార్ ఆఫ్ ఇండియా అవార్డులు సైతం కైవసం చేసుకున్నారు. అలాగే జాతీయ స్థాయిలో నాలుగు సార్లు గోల్డ్‌మెడల్, ఏడు సార్లు సిల్వర్ మెడల్, ఐదుసార్లు కాంస్య పతకాలను సాధించి సత్తాచాటారు. రాష్ట్ర స్థాయి క్రీడలలో కూడా తమదైన ముద్రను వేసుకోవటంతో పాటు స్టేట్ బెస్ట్ ప్లేయర్స్ అవార్డులను సాధించారు. పాఠశాల నుంచి 43 మంది వివిధ క్రీడాపోటీలలో పాల్గొనగా 27 మెడల్స్ సాధించడం గమనార్హం. ముఖ్యంగా బాల్‌బ్యాడ్మింటన్‌లో పాఠశాల విద్యార్థులు జిల్లాలో ప్రథమస్థానంలో ఉండటమే కాకుండా క్రీడా కోటాలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్నారు. అలాగే చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సైతం క్రీడా కోటాలో ఉచిత విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలకు చెందిన పీ కార్తీక్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సబ్ జూనియర్స్ స్కూల్‌గేమ్స్ అండర్–17 విభాగంలోను, కిల్లాడి శైలేంద్రకుమార్ బాల్‌బ్యాడ్మింటన్ అండర్–14 విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్ సర్వజ్ఞ రగ్బీ, బాలబ్యాడ్మింటన్ క్రీడలలో రాష్ట్రస్థాయిలో తృతీయస్థానం సాధించారు. బాలల దినోత్సవం సందర్భంగా కార్తీక్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు చేతులమీదుగా బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకున్నారు.

ప్రోత్సాహంతోనే రాణిస్తున్నా

పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నాను. ఉన్న వసతులతోనే సాధన చేస్తూ ఈ ఫలితాలు సాధించగలిగాను. క్రీడల్లో ఉత్తమ ప్రదర్శనతో పాటు క్రీడా కోటాలో రైల్వే, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉంది.

– పి.కార్తీక్, 9వ తరగతి

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందాలని..

రోజూ 5 నుంచి 6 గంటలు ప్రాక్టీస్ చేయడం ద్వారా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగలిగాను. జాతీయస్థాయిలో కూడా మంచి ప్రదర్శన కనబరిచి పాఠశాలకు నగరానికి పేరు తీసుకురావాలని ఉంది. స్పోర్ట్స్ కోటాలో ఇంజినీర్ కావాలని ఉంది.

– కె.శైలేంద్రకుమార్, 9వ తరగతి

ఉన్నత విద్యనభ్యసించాలని..



రోజుకు నాలుగు నుంచి ఐదు గంటలు ప్రాక్టీస్ చేస్తున్నా. క్రీడలలో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించాలని ఉంది.

– ఎస్.సర్వజ్ఞ, 8వ తరగతి

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేసి, ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 23వ డివిజన్ 98వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. బీసెంట్ రోడ్డు, గూడవల్లి వారి వీధి, రాజగోపాలచారి వీధి, బైరెడ్డి రామన్న వీధి, చీరగుడి వారి వీధి, ప్రకాశం రోడ్డు, అలీబేగ్ వీధి, బందర్ రోడ్డు, మేరీ వీధులలో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన కరపత్రాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్లుగా చేస్తోన్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధులతో ఈ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

క్యాన్సర్ రహిత సమాజం లక్ష్యం

క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఈ మహమ్మారి పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి.. నివారణకు ప్రోత్సహించడమే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ద్వారా త్వరగా నివారించే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పొగాకుకు దూరంగా ఉండటం, ఆల్కహాల్‌ను పరిమితం చేయడం వంటి చక్కని ఆరోగ్య సూత్రాలను పాటించడం ద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో క్యాన్సర్ నివారణకు రూ.400 కోట్లను ఈ ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారు. సీఎం వైఎస్ నేతృత్వంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రాబోయే రోజుల్లో క్యాన్సర్ నివారణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం ఖాయమన్నారు.

టీడీపీ కార్యాలయం ఒక అబద్ధాల ఫ్యాక్టరీ

టీడీపీ కేంద్ర కార్యాలయం ఒక అబద్ధాల ఫ్యాక్టరీ అని మల్లాది విష్ణు విమర్శించారు. గోబెల్స్ బాబు నేతృత్వంలో టీడీపీ ఆఫీస్ అబద్ధాలను వండివార్చే కార్యాలయంగా మారిపోయిందని మల్లాది విష్ణు ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన సామాజిక వర్గాలలో చీలికలు తీసుకొచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు స్వర్ణ యుగం మొదలైందే 2019 నుంచి అని మల్లాది విష్ణు తెలిపారు. మైనార్టీలపై ప్రేమతో ఆనాడు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పిస్తే.. నేడు సీఎం వైఎస్ జగన్ ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తున్నారన్నారు. మూడున్నరేళ్లలో మైనార్టీ సంక్షేమం కోసం రూ.20,330.43 కోట్లు ఖర్చు చేశారన్నారు. అలాగే మైనార్టీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించినట్లు పేర్కొన్నారు. మైనార్టీలను చంద్రబాబు ఏ విధంగా మోసం చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని.. మంత్రివర్గంలో కూడా స్థానం కల్పించకుండా అవమానించి, కేవలం ఎన్నికల ముందు సవతి తల్లి ప్రేమ చూపించారని ఆరోపించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

కలెక్టర్ ఢిల్లీరావు



క్యాన్సర్‌పై అవగాహన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే సమాజంలో అవగాహన చాలా ముఖ్యమన్నారు. ఆహార అలవాట్లు, మంచి జీవనశైలి, ఒత్తిడిని తగ్గించుకునే మార్గంలో భాగంగా యోగా, ధ్యానం, నడకను అలవరచుకోవడం ద్వారా క్యాన్సర్‌బారిన పడకుండా తమను తాము కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, డీఐఓ డాక్టర్ అమృత, డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్ దేవి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

మధుర స్వరాల గాయని వాణి జయరాం



విజయవాడ కల్చరల్: మధుర స్వరాల గాయని వాణి జయరాం అని శ్రీకళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద శనివారం గాయని వాణీ జయరాం సంస్మరణ సభ నిర్వహించారు. వివిధ కళాసంస్థల ప్రతినిధులు దండు చంద్రశేఖర్, చింతకాయల చిట్టిబాబు, చలపతి రావు, మల్లాది స్వాతి, శ్యాంప్రసాద్ తదితరులు వాణి జయరాం చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె సినీ రంగ సేవలను కొనియాడారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి పునఃప్రతిష్ట మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో దత్తాత్రేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవాలు శనివారం రెండో రోజున ఘనంగా నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు మహోత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమాలను మందిర కార్యదర్శి కుంచనపల్లి రవి శంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక బడ్జెట్ అని సీఐటీయూ పేర్కొంది. శనివారం గవర్నర్‌పేట లెనిన్ సెంటర్‌లో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ,సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎంవీ సుధాకర్ మాట్లాడుతూ బడ్జెట్ ప్రతిపాదనలు సవరించాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనకు సీఐటీయూ సిద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కమల, దుర్గారావు, సీతారాములు, సుబ్బారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న మహిళామణులను గుర్తించి సర్వేజనాః సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో మహిళారత్న, మహిళా శిరోమణి అవార్డులతో సత్కరించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల అభ్యున్నతికి సేవలు అందిస్తున్న మహిళలను వచ్చే నెల 12వ తేదీన హైదరాబాద్‌లో పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు. అర్హత కలిగిన మహిళలు వారు అందించిన సేవల వివరాలతో ఈ నెల 15వ తేదీలోపు సర్వేజనా సుఖినోభవంతు, డోర్ నంబర్ 1–20–164, పోస్టు తిరుమలగిరి, గోకుల్‌నగర్, వెంకటాపురం సికింద్రాబాద్–15 చిరునామాకు పంపించాలని పేర్కొన్నారు. సమాచారం కోసం 96523 47207లో సంప్రదించాలని కోరారు.

ప్రలోభాలతో చిచ్చుపెడుతున్న చంద్రబాబు

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రెడ్డి ప్రజాప్రతినిధులను ప్రలోభాలతో లొంగదీసుకుని చిచ్చుపెట్టి సమాజంలో అలజడులు సృష్టించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెడ్డి ప్రజాప్రతినిధులు చంద్రబాబు ట్రాప్‌లో పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రెడ్ల వైఖరిపై అరాచక ధోరణితో ప్రవర్తిస్తున్న టీడీపీలో రెడ్లు ఇమడలేరనే విషయం తెలుసుకోవాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబు రెడ్లను అణగదొక్కిన నేపథ్యంలో టీడీపీ నుంచి ఒక్క రెడ్డి కూడా ఎమ్మెల్యేగా గెలవలేదని, ఆ పార్టీ ఆవిర్భావం నుంచి ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదని గుర్తుచేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సుమారు 350 మందికి పైగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఫ్యాక్షన్ ను పూర్తిగా నిర్మూలించి శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తుంటే చంద్రబాబు మాత్రం రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించేందుకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. రెడ్డి ప్రజాప్రతినిధులు చంద్రబాబు చరిత్రను గమనించి ప్రలోభాలకు లొంగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ


సీసీ రోడ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 23వ డివిజన్‌లో రూ.12.88లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. మద్దులపల్లి వారి వీధిలో రూ.7.89 లక్షల నిధులతో సీసీ రోడ్లు, భవానీ వారి వీధిలో రూ.4.99 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గవర్నర్ పేట ప్రాంత ప్రజల అవసరాలను తీర్చడంలో గత టీడీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 14 ప్రధాన రహదారుల నిర్మాణాలు చేపట్టి ఈ ప్రాంత ముఖచిత్రమే మార్చివేసిందన్నారు. ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా వారి ఆకాంక్షల మేరకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గత మూడున్నరేళ్లలో డివిజన్‌లో రూ.15.39 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు మల్లాది విష్ణు చెప్పారు. సెంట్రల్ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తోన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, కో–ఆర్డినేటర్ ఒగ్గు విక్కీ, చల్లా సుధాకర్, వెన్నం రత్నారావు, పసుమర్తి రాజేష్ పాల్గొన్నారు.

మెరుగైన దంత వైద్యసేవలందించండి


ఆర్థోడాంషియా పీజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న జీఎస్ నవీన్‌కుమార్, శ్రీనివాసరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో దంత సమస్యలున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పూర్వ ప్రత్యేక కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్ అన్నారు. ఆయన వైద్యశాఖ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సమయంలో కోల్గేట్ సంస్థ నుంచి ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఆర్థోడాంషియా పీజీ విభాగానికి ఎనిమిది డెంటల్ చైర్స్‌ను అందించారు. వాటిని ఆ విభాగంలో ఇన్‌స్టాల్ చేయగా, శనివారం ఆ పీజీ విభాగాన్ని జీఎస్ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలను అందించాలనే దృక్పథంతో కోల్గేట్ సంస్థ ఎనిమిది డెంటల్ చైర్స్ అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికీ సత్వర, మెరుగైనసేవలు అందించేందుకు ప్రతి వైద్యుడు కృషి చేయాలన్నారు. అనంతరం జీఎస్ నవీన్‌కుమార్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కోల్గేట్ సంస్థ నుంచి డెంటల్ చైర్స్ అందజేసేందుకు సహకరించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ మెహబూబ్ షేక్ పాల్గొన్నారు.

బాల బాలికలలోని ప్రతిభను గుర్తించాలి


నృత్యపోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పీవీఎన్ కృష్ణ, భాస్కరశర్మ

విజయవాడ కల్చరల్: బాల బాలికలలోని ప్రతిభను వెలికి తీసి, గుర్తించాల్సిన అవసరముందని సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో భరతముని జయంతి సందర్భంగా రెండురోజుల నిర్వహించే రాష్ట్రస్థాయి సంప్రదాయ నృత్య పోటీలను గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతీయ యువత ప్రగతి పథం వైపు నడుస్తోందన్నారు. వారిలోని ప్రతిభను వెలికితీసి వారిని సంస్కారవంతమైన యువతగా తీర్చిదిద్దేందుకు సంస్కార భారతి కృషి చేస్తోందన్నారు. సంస్కార భారతి మహానగర్ (విజయవాడ) అధ్యక్షుడు భాస్కర శర్మ మాట్లాడుతూ భారతీయ నాట్యశాస్త్రాలకు ఆదిపురుషుడు భరతముని అని, ఆయన రచించిన నాట్యశాస్త్రం ప్రామాణిక గ్రంథంగా అభివర్ణించారు. భరతముని జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. నాట్యాచార్యుడు పిల్లా ఉమామహేశ్వర పాత్రుడు, వై అనురాధ, న్యాయనిర్ణేతలగా వ్యవహరించారు. కార్యక్రమంలో సంస్కారభారతి నగర కార్యదర్శి సీతారత్నం, సంస్కారభారతి నాట్యవిభాగం నిర్వాహకులు జీ కుసుమసాయి, బీ రూపాశ్రీ, కే వాసుదేవరావు పాల్గొన్నారు.

మురళీకృష్ణ ప్యానెల్‌కు గౌతంరెడ్డి అభినందన


మురళీకృష్ణ ప్యానెల్‌ను సత్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈఎస్ఐ డిస్పెన్సరీ స్టాఫ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎలక్షన్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన మురళీకృష్ణ ప్యానెల్ సభ్యులు శనివారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మురళీకృష్ణ ప్యానెల్ సభ్యులను పూలమాల, శాలువాతో గౌతంరెడ్డి సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళీకృష్ణ ప్యానెల్‌కు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షుడు నాళం మురళీకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆశీస్సులతో తమ ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యిందన్నారు. తమకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తామన్నారు.

నూతన కమిటీ..

సొసైటీ అధ్యక్షుడిగా నాళం మురళీ కృష్ణ (గవర్నమెంట్ హాస్పిటల్), ఉపాధ్యక్షుడిగా ప్రసాద్ (మలేరియా డిపార్ట్‌మెంట్), సెక్రటరీగా పీ శ్రీనివాసరావు (ఈఎస్ఐ హాస్పిటల్), డైరెక్టర్లుగా ఎస్ఎన్ సత్యనారాయణరెడ్డి (ఆయుర్వేదిక్ హాస్పిటల్), పీ జయకుమార్ (గవర్నమెంట్ హాస్పిటల్), వీ చలపతిరావు (ఈఎస్ఐ డిస్పెన్సరీ), ఎ.రంగమ్మ (గవర్నమెంట్ హాస్పిటల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సూర్యోపాసన సర్వశ్రేయోదాయకం


అరుణ పారాయణం చేస్తున్న రుత్వికులు

విజయవాడ కల్చరల్: సూర్యోపాసన సర్వశ్రేయోదాయకం అని వేదపండితులు దెందుకూరి సుబ్రహ్మమణ్య శర్మ అన్నారు. శృంగేరీపీఠాధిపతి జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి పుట్టినరోజు సందర్భంగా దుర్గాపురంలోని విద్యాభారతి శ్రవణ సదనంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మమణ్య శర్మ మాట్లాడుతూ భారతీయ పురాణాలలో సూర్యుడికి ప్రత్యేక స్థానముందని తెలిపారు. ఆదిత్యహృదయం పఠించడం వల్ల సర్వశుభాలు కలుగుతాయన్నారు. రుత్వికులు సూర్యనారాయణ అర్చన, మహాసౌరం, అరుణ పారాయణ, సౌరాష్టాక్షరి, మంత్రజపం నిర్వహించారు. ధర్మాధికారి హనుమత్‌ప్రసాద్ మాట్లాడుతూ లోక కల్యాణం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు.